విశాలాంధ్ర అనంతపురం

www.visalaandhra.com

కర్నూలు, సోమవారం 11, డిసెంబర్ 2023

సిపిఐ బలోపేతం కావాలి

- సభ్యత్వం రెట్టింపు చేద్దాం
- సీపీఐ కార్యకర్తలకు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జగదీష్ పిలుపు

విశాలాంధ్ర-అనంతపురం: పేద, బడుగు, బలహీన వర్గాల పక్షపాతిగా ఎర్రజెండా పార్టీ స్వాతంత్రోద్యమం నుండి పనిచేస్తూ ముందుకు సాగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ అనంతపురం జిల్లాలో మరింత బలోపేతం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కే రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్ పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురం నగరంలోని వికె మెమోరియల్ హాల్లో సిపిఐ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జిల్లా కార్యదర్శి జాఫర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు నారా యణస్వామి, మల్లికార్జున,, కార్యదర్శి వర్గ సభ్యులు సంజీవప్ప, నగర కార్యదర్శి శ్రీరాములు నియోజక వర్గం కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖల్లో సభ్యత్వ నమోదు యుద్ధ ప్రాతిపదికన జరగాలని కోరారు. డిసెంబర్ 26వ తారీఖున సిపిఐ ఆవిర్భావ దినోత్సవం రోజు నాటికి సభ్యత్వం పూర్తి కావాలని సూచించారు. రాష్ట్రంలో అనంతపురం జిల్లా సభ్యత్వ నమోదులో మొదటి స్థానంలో ఉండాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి మండల నాయకులు, శాఖ కార్యదర్శులు పూర్తి స్థాయిలో పనిచేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో సిపిఐ పోటీ చేయాలంటే క్షేత్రస్థాయిలో బలం పుంజుకోవాలన్నారు. సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, ఇలా అన్ని ఎన్నికల్లో రాబోవు రోజుల్లో సిపిఐ పోటీ చేస్తుందన్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగవంతం చేస్తూ పార్టీలోకి కొత్త రక్తాన్ని ఎక్కించాలని యువకులను విద్యావం తులను మహిళలను అత్యధిక సంఖ్యలో పార్టీ సభ్యులుగా చేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జగదీష్ సమక్షంలో నగరానికి చెందిన పలువురు విద్యావంతులు సిపిఐ లో చేరారు. పార్టీలో చేరిన వారిలో కురుబ జగదీష్, గజ్జల మనోహర్, మన్నల కళ్యాణ్ భార్గవ్, శ్రీధర్ హరిచరణ్లు ఉన్నారు.

శింగనమల సివిల్ సప్లై గోడౌన్‌లో అంతులేని అవినీతి

- తక్కువ తూకాలు అందించడంలో వెన్నతో పెట్టిన విద్య
- మండిపడుతున్న డీలర్లు..

విశాలాంధ్ర-శింగనమల : మండలం లోని తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న సివిల్ సప్లై గోడౌన్లో సిఎస్‌డిటి డీలర్లకుతక్కువ తూకాలదదిస్తూ డీలర్లను ప్రజలను మోసం చేస్తున్నాడని, ఇక్కడి నుండి నార్పల,శింగనమల మండలాలకు రేషన్ సప్లై చేయాలని తక్కువ తూకాలిస్తూ సి ఎస్‌డిటి మమ్మల్ని మోసం చేస్తున్నారని డీలర్లు వాపోతున్నారు, గతంలో ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని, వార్తా కథనాలు వెలువడినప్పుడు మాత్రమే సంబంధిత జిల్లా అధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారని, ఇది షరామామూలు అయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఈనెల డీలర్లకు స్టాక్ పాయింట్ అధికారులు టేర్వేట్ సరైన తూకాలు కూడా అందివ్వ లేదని, శింగనమల నియోజకవర్గ కేంద్రంలోని సివిల్ సప్లై గోడౌన్ లో జిల్లాస్టాక్ పాయింట్ అధికారులు చెప్పినను అధికారుల మాటలు మూటగట్టి శింగనమల స్టాక్ పాయింట్ అధికారులు ఇష్టానుసారంగా రేషన్ సరుకులు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు మెండుగా ఉన్నాయి,డీలర్లకు టేర్వేట్ (సరైన తూకాలు)అందివ్వాలని డీలర్లు అడుగుతున్నా అధికా రులు వారి విన్నపాన్ని పట్టించుకోవడం లేదంటున్నారు,టేర్వేట్ అందించాలని అడుగుతున్న డీలర్లకు ఈనెల ఇవ్వలేమని ఇబ్బందులు ఉన్నాయని, వచ్చే నెల నుండి టేర్వేట్ తూకాలు అందిస్తామని మాయమాటలు చెబుతున్నారని,ఈ విధంగా చెప్పుకుంటూనే దాదాపు ఏడాది పైన అవుతోందని పలువురు డీలర్లు ఆరోపిస్తు న్నారు. తూకాలు తక్కువగా వస్తున్నాయని అధికారులకు విన్నవించినా వారు స్పందించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి,ముఖ్యంగా డీలర్లకు ఏయే సరుకులు ప్రభుత్వం నుండి అందించామో బిల్లుల రూపంలో ఇవ్వాల్సిన కంప్యూటర్ బిల్లులు ఏ ఒక్కరికి అందిస్తున్న దాఖలాలు లేవని డీలర్లు పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు,సంబంధిత శాఖ అధికారులు సిఎస్‌డిటిపై చర్యలు తీసుకోక పోవడం లో ఆంతర్యం ఏమిటని పలువురు డీలర్లు చర్చించుకుం టున్నారు, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు స్పందించి మండల స్థాయి గోడౌన్ అధికారులపై చర్యలు తీసుకొని డీలర్లకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

వైసీపీ అరాచక పాలనపై తిరగబడదాం

- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్

విశాలాంధ్ర-పామిడి: వైసీపీ అరాచక పాలనపై ప్రతి ఒక్కరూ తిరగబడాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడుయాదవ్ పేర్కొన్నారు. గుంతకల్లు నియోజక వర్గంలోని పామిడి పట్టణం కొండాపురం గ్రామానికి పరిధిలోని వార్డుల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం వార్డులలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నాలుగున్నర ఏళ్ల పాలనలో దోపిడీ అక్రమాలు అవినీతి దౌర్జన్యాలు కనిపిస్తున్నాయి తప్ప అభివృద్ధి పూర్తిగా శూన్యంగా మారిందన్నారు. ఏ ప్రాంతంలో చూసినా వైసీపీ ప్రభుత్వాన్ని చీదరించుకునే స్థాయికి వెళ్ళిందంటే పరిపాలన ఏవిధంగా ఉందో స్పష్టంగా అర్థం అవుతుంది అన్నారు. అందుకోసమే మనమం దరం సమిష్టిగా పోరాటం చేస్తూ వైసిపి ప్రభుత్వ అరాచక పాలనపై చరమగీతం పాడి టిడిపి విజయానికి కృషి చేస్తూ, సీఎంగా చంద్రబాబునాయుడు గెలిపించుకుం దామంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పామిడి మండల కన్వీనర్ ముసలి రెడ్డి. మాజీ ఎంపిటిసి బాలరాజు. మధుసూదన్, భాస్కర్, జయ కుమార్, సునీల్, సురేష్, సునీల్, చంద్ర, సూర్యనారాయణ, మధు. మాజీ టౌన్ కన్వీనర్ శ్రీరాములు, మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి, సుంకన్న, మాజీ డీలర్ ఓబులేష్, రామాంజనేయులు, భాస్కర్, రంగారెడ్డి, బాబు, పామిడి మండలం, కొండాపురం చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ప్రభుత్వ విప్

విశాలాంధ్ర-రాయదుర్గం, రూరల్: పట్టణంలో ఆదివారం ప్రభుత్వ కాపు రామచంద్రారెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. జిజిఎంపీ, సి ఎం డి ఎఫ్, తదితర నిధుల నుండి మంజూరు చేసిన అభివృద్ధి పనులు 12,17,19,20 వా వార్డులలో వాటర్ ట్యాంకులను ప్రారంభించారు. 10వ వార్డులో సీసీ రోడ్డు వేయడానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్ఆర్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కల్యాణదుర్గలో చైన్ స్నాచింగ్ ..

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపం లో కాలినడకన వెళ్తున్న ఇద్దరు మహిళలను వెంబడించిన దుండగుడు ఉషా అనే మహిళ మెడలో మాంగళ్య చైన్ లాక్కెళ్లాడు. ఆదివారం ఉదయం ఆర్టీసీ బస్టాండ్ కాలనీ నుండి పంపనూరు సుబ్రహ్మణ్యస్వామి దేవా లయానికి వెళ్లడానికి ఇంటి నుంచి ఉష అనే మహిళ తన స్నేహి తురాలితో కలిసి వెళుతుండగా వెంబడించిన దుండగుడు మెడలో చైన్‌లాక్కెళ్లాడు. అప్రమత్తమైన మహిళలు దుండగుడిని పట్టుకోడానికి ప్రయత్నించగా వడ్డే కాలనీ వైపు పరుగులు తీసి పరారయ్యాడు. వెంటనే మహిళలు 100కు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని నిందితుడి కోసం గాలించినా ఫలితం లేకపోయింది. మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు దుండ గుడిని పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. వారం రోజులుగా కళ్యాణ దుర్గం పట్టణంలో మేడా వీధి, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో చైన్ స్నాచర్లు రెచ్చిపోతు న్నడంతో మహిళలు ఒంటరిగా బయటకు వెళ్ళడానికి భయాం దోళనకు గురవుతున్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు ...

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: ధన్వంతరి జయంతి పురస్కరిం చుకొని ఆరోగ్య భారతి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కోర్ట్ రోడ్‌లో ఉన్న శివ కృపలో శ్రీ ధన్వంతరి జయంతి వేడుకలను నిర్వహించినట్లు ఆరోగ్య భారతి గౌరవ అధ్యక్షులు, విశ్రాంత ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యాధికారి డాక్టర్ వి.నాగేశ్వరరావు పేర్కొన్నారు. ధన్వం తరి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాణాల ప్రకారం, దేవతలు, రాక్షసులు లక్షీర సాగర మథనంలి చేస్తున్నప్పుడు కార్తీక బహుళ త్రయోదశి రోజున శ్రీ మహా విష్ణువు ధన్వంతరి అవతారంలో అమృత కలశముతో ఉద్భవించారు అని పేర్కొన్నారు. అదే రోజున ధన్వంతరి పుట్టినరోజుగా భావిస్తారన్నారు. వైద్యులు అప్పటినుంచి ప్రతి ఏటా ధన్వంతరి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. మానవాలికి ఆరోగ్యాన్ని ప్రసాదించే శ్రీ ధన్వంతరిని ప్రార్థిస్తే దీర్ఘాయువు లభిస్తుందని చాలా మంది నమ్మకంగా భావిస్తారు అన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఆళ్లగడ్డ దగ్గర అహోబిలం రోడ్డులో ఉన్న బచపల్లి మెట్ట దగ్గర ధన్వంతరి ఆలయంలో ఈరోజు పెద్దఎత్తున పూజలు నిర్వహిస్తా రన్నారు. కార్యక్రమంలో వి.అమృత లక్ష్మి, ఆయుర్వేద వైద్యురాలు వి.రజిత, ఆరోగ్య భారతి సంస్థ కార్యదర్శులు రతన్‌బాబు, కిషోర్, కృష్ణమూర్తి, రామకృష్ణ, రమణబాబు, రంజిత్, నరసింహ శర్మ, వి.తక్షక్ పాల్గొన్నారు.

కట్టపోగు బసవరావు పాదయాత్రకు మద్దతు

విశాలాంధ్ర-పామిడి: మండలంలోని గుప్తా కాలనీ వైసీపీ కార్యాలయం నుంచి ఆదివారం కట్టపోగు బసవరావు పాద యాత్ర కొనసాగించారు. పామిడి వైసీపీ నాయకులు పాదయాత్ర మద్దతు తెలిపారు. ఎగువపల్లి హైవే వరకు పాద యాత్రలో మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు. పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్ మాట్లా దుతూ వై నాట్ 175కి 175 మన నాయ కుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి తిరిగి మళ్ళీ ముఖ్య మంత్రి కావాలని, ఇదుపులపాయ నుంచి ఇచ్ఛా పురం వరకు పాదయాత్ర చేపట్టిన కట్టెపోగు బసవరావుకి ప్రతిఒక్క వైఎస్ఆర్‌సీపీ నాయ కులు, కార్యకర్తలు మద్దతు పలికి పాదయాత్ర విజయ వంతం చేయాలని తెలియజేశారు. కార్యక్రమం లో ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, పట్టణ వైస్ కన్వీనర్ సాలేహా. శివారెడ్డి, మైనార్టీ సీనియర్ నాయకులు అన్వర్‌సాబ్, మనోజ్, పామిడి పట్టణ బూత్ కన్వీనర్ వెంకట్ గుప్తా, పామిడి పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు నాగేష్, పట్టణ ఎస్సీ సెల్ అధ్య క్షులు శివ రాథోడ్, వినోద్, మహబూబ్, నీలూరు రమణారెడ్డి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

డేగల కృష్ణమూర్తికి ఘన సన్మానం..

విశాలాంధ్ర-శింగనమల: మండల పరిధిలోని గుమ్మేపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొనసాగుతూ రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్య నిర్వాహక కార్యదర్శిగా నూతంగా ఎన్నికైన దేగల కృష్ణమూర్తిని అనంతపురం లోని ఆయన నివాసంలో తెలుగుదేశం నాయకులు అభిమానులు గజమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి అరుగుల రాజు, కొర్రపాడు యుగంధర్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నరేంద్ర కుమార్ యాదవ్, జిల్లా బీసీ సెల్ కార్య నిర్వాహకకార్యదర్శి కొయ్యగూన పెద్దన్న, జిల్లా తెలుగు యువత కార్యదర్శి వడ్డే రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమస్యలను సమస్యలపై ప్రస్తావించండి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను కలసిన ఉపాధ్యాయ నాయకులు

విశాలాంధ్ర-రాప్తాడు: రాష్ట్రంలోని అధ్యాపక ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆ సంఘం నాయకులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం అనంతపురం వచ్చిన ఆయన్ను వారు కలిసి మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా వివిధ ప్రైవేట్ కళాశాలలో పాఠశాలల్లో చాలీచాలని జీతాలతో బతుకు వెల్లదీస్తున్నామన్నారు. పెరిగిన ధరలు కనుగుణంగా జీతాలు పెంచేలా చర్యలు చేపట్టేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం తమకోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్ చెన్నకేశవులు, జిల్లా అధ్యక్షుడు ఆనందబాబు, సభ్యులు కల్లప్ప, పోతురాజు, కర్రల నగేష్, బుడగల శ్రీనివాసులును అభినందించారు.

భక్త కనకదాసు సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: కురుబల ఆరాధ్య దైవంగా కొలిచే భక్త కనకదాసు జయంతి ఆదివారం మండలంలోని శ్రీధరగట్ట గ్రామంలో కురుబ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కురుబలు రాజకీయంగా, ఆర్థికంగా బలపడాలంటే ప్రతిఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించుకున్నప్పుడే రాజక ీయంగా, ఆర్థికంగా బలపడి కురుబలు అన్ని రంగాల్లో రాణించాలని కురుబ సంఘం మండలాధ్యక్షులు పరమేశ్వర, గ్రామ సర్పంచ్ యోగేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా భక్త కనకదాసు చిత్రపటా నికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్త కనకదాసు చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం డబ్బు వాయిద్యాలతో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన సినీనటుడు

విశాలాంధ్ర-రాప్తాదు: అనంతపురం ఎమ్మెల్యే వైకుంఠం ప్రభా కర్ చౌదరిని పలు సినిమాలలో ప్రతి నాయకుడుగా నటించిన నాగి నీడు అర్బన్ టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలి శారు. పలు అంశాలపై చర్చించారు. ప్రభాకర్ చౌదరి రచించిన అవినీతి, ఫ్యాక్షనిజం, పుస్తకాలను సినీనటుడు నాగినీడుకు అందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-ఉరవకొండ: పెన్నహోబిలం సమీపం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉరవకొండ పట్టణానికి చెందిన గట్టు వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు వెంకటేష్ మరో వ్యక్తితో కలిసి తిరుమలకు కాలినడకన బయలుదేరగా అనంతపురం నుంచి వేగంగా వస్తున్న బైక్ ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయ పడటంతో హుటాహుటిన ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కమనీయం.. శివపార్వతుల కళ్యాణం

విశాలాంధ్ర-శింగనమల: మండల కేంద్రంలోని చిన్న కాలువ శివాలయంలో ఆదివారం శివ మాలధారులు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శివాలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బస్టాండ్ దగ్గర చౌడేశ్వరి దేవి ఆలయం ముందు గౌరవయ్యలతో పాల విన్యాసం నిర్వహించారు. రాత్రికి శివపార్వతుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు.

ఉప్పరహాళ్ టీడీపీ కార్యకర్త మృతి...

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని ఉప్పరహాళ్ గ్రామంలో గవిసిద్ధ(40) అనే టీడీపీ కార్యకర్త అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఎస్సీ నాగరాజు మృ తదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎంపీటీసీ తిప్పేస్వామి, టీడీపీ నాయకుడు భవానీ నివాళులు అర్పించారు.

రిటైర్డ్ జడ్జి కిష్టప్పకు ఘన సన్మానం..

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: నిరుపేదల కోసం నిరంతరం శ్రమించిన రిటైర్డ్ జడ్జి కురుబ కిష్టప్ప కు న్యాయ సేవా రత్న పురస్కారం అందుకున్న సందర్భంగా ఆదివారం అనంతపురం నగరంలోని వాల్మీకి కళ్యాణమంటపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు పాల్గొని న్యాయ సేవారత్న పురస్కార గ్రహీత రిటైర్డ్ జడ్జ్ కురుబ క్రిష్టప్ప కు పూలమాల శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కురుబ సంఘం ఉపాధ్యక్షులు ఎస్.కె.మల్లికార్జున, రాయదుర్గం మార్కెట్ యార్డ్ మాజీ ఉపాధ్యక్షులు హెూన్నూరప్ప, రాష్ట్ర కురుబ సంఘం వర్గ కార్యదర్శి ఫోటో బసవరాజు, డాక్టర్ బసప్ప, తదితరులు పాల్గొన్నారు.

మంచి వ్యక్తులను ఎమ్మెల్యేగా ఎన్నుకోండి..

- మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి

విశాలాంధ్ర-అనంతపురం రూరల్: పాలకులు మంచివారైతే సమాజం అభి వృద్ధి చెందుతుందని, మంచి వ్యక్తులను ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే నగర అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో టిఎన్టియుసి ఆధ్వర్యం లో నిర్వహించిన టైలర్స్ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా వైకుంఠం ప్రభాకర్ చౌదరి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మీ మంచి కోసం నిరంతరం కృషి చేస్తానని, ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో 13500 రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇంటి పట్టాలు అందించామని, పేద ప్రజలకు మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో రూ.150 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించామన్నారు. ప్రతి పేదవాడికి ఇల్లు ఉండాలనే లక్ష్యంతో 6వేల టిడ్కో ఇల్లు 90 శాతం పూర్తి చేశామని, మిగిలిన 10 శాతం వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శిం చారు. నాలుగు నెలల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని ఉన్న 6వేల ఇళ్లతో పాటు, మరో ఆరువేల ఇల్లు నిర్మాణం పూర్తిచేసి పేదలందరికీ నివాస గృహాలు కట్టిస్తా మన్నారు. కార్యక్రమంలో టిఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీ నరసిం హులు, ఈటె స్వామిదాసు,జేయం భాష, పూల భాష, ముత్యాలు, టైలర్స్ సంఘ అసోసియేషన్ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

జాతీయ న్యాయ దినోత్సవ సందర్భంగా సేవరత్నకు ఘన సన్మానం



విశాలాంధ్ర-శింగనమల: నిరుపేదల కోసం నిరంతరం శ్రమించిన న్యాయ మూర్తి యం.క్రిష్టప్ప "న్యాయ సేవా రత్న" పురస్కారం అందుకున్న సందర్భంగా అనంతపురం నగరం లోని వాల్మీకి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, వై.యస్.ఆర్.సి.పి సీనియర్ నాయకులు తోపు దుర్తి చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి శింగనమల మండల కన్వీనర్ పట్నం నగేష్‌లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మొదటగా పురస్కార గ్రహీత క్రిష్టప్పని సత్కరించి అనంతరం సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ రామదాసప్ప నాయుడు రాసిన "పేదల న్యాయమూర్తి (క్రిష్టప్ప)" పుస్తకాన్ని ఆవిష్కరించారు. చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ సాధార ణంగా ఒక వ్యక్తి వారి వృత్తితో ప్రాచుర్యం పొందా రంటే ఆ వృత్తి పట్ల ఎంతటి అంకితభావంతో పని చేసి ఉంటారో అర్థం అవుతుందని,అలాంటి కోవకు చెందిన వారిలో, గుడిసె నుండి జిల్లా జడ్జ్ స్థాయికి ఎదిగి, జడ్జ్ క్రిష్టప్ప గా ప్రజలకు చేరువయ్యా రని,అలాంటి వ్యక్తికి న్యాయ సేవా రత్న పురస్కారం రావడం చాలా సంతోషకరమని, ఇలాంటి పురస్కారాలు మరెన్నో పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాలగొండ ఆంజనేయులు, విశ్వనాథ్, పుల్లారెడ్డి, ఇతర పుర ప్రముఖులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షకుడు.. రెడ్డప్పశెట్టి

▶ వందల ఎకరాల్లో చెట్ల పెంపకం.. ▶ విపరీతంగా పెరిగిన భూగర్భ జలాలు ▶ చితమత్తూరువాసుల్లో ఆనందం



.. రెడ్డప్ప శెట్టి

విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్: మండలంలోని కోడూరు, మరసలపల్లి, పంచాయతీల పరిధిలో రెడ్డప్ప శెట్టి అనే వ్యక్తి పర్యాపరణ పరిరక్షణకు నడుంబిగించాడు. ఈ ప్రాంతంలో దశాబ్దం క్రితం వర్షాలు పడక రైతులు కష్టాల కడలిలో చిక్కుకున్నారు. పొట్టచేతపట్టుకుని ఇతర ప్రాంతాలకు వలస పోయారు. ఈ క్రమంలో రెడ్డప్ప శెట్టి ఇక్కడి పరిస్థితిని క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. న్యాయబద్ధమైన ధరలతో పొలాలు కొనుగోలు చేశాడు. కాలుష్య కోరల్లో చిక్కుకొన్న ప్రజలకు ఉపసమనం కలిగించేందుకు చెట్ల పెంపకానికి శ్రీకారం చుట్టాడు. ముందుగా ఆ ప్రాంతంలో వర్షపు నీరునిల్వ ఉంటేనే పంటలు పండుతాయని భావించాడు. ఇందుకు అపర భగీరథ ప్రయత్నం చేశాడు. పలురకాల చెట్లను నాటి కంటికి రెప్పలా సాకడంతో నేడు ఆ ప్రాంతం అడవిని తలపిస్తున్నది. జామ, సపోటా, కొబ్బరి, అరటి తదితర పలు చెట్లు ఉద్యానవనాన్ని తలపిస్తున్నాయి. ఆ చుట్టూ పక్కల గ్రామ పరిసరాలు ప్రకృతి రమణీయతకు ఆలవాలంగా మారింది. ఆ ప్రాంతంలో వర్షపు నీరు వృథాగా వెళ్లకుండా భూగర్భ జలాలు పెంపొందించేం దుకు లక్షలాది రూపాయలు వెచ్చించి చెక్ డ్యాములు, నీటి కుంటలు, ఫారం పాండ్లు నిర్మించి ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టాడు. ప్రతి వర్షపు చుక్కను సద్వినియోగం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగడంతో నేడు భూగర్భ జలం ఉరకలేస్తున్నది. దీంతో ఆ ప్రాంత ప్రజలు, పర్యావరణ ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు రకాల మొక్కలు నాటడంతో అవి ప్రస్తుతం వృక్షాలుగా మారి సుందరమైన ఉద్యానవనాలుగా దర్శనమిస్తున్నాయి. సాయంత్రం కాగానే ఎక్కడిఎక్కడి నుంచో సుందరమైన పక్షులు ఆ చెట్లపైకి వచ్చి నివాసముంటున్నాయి. పక్షుల కిలకిలరావాలతో ఆహ్లాదకరమై వాతారణం నెలకొంది. ఆ ప్రాంతంలో వర్షపాతం కూడా నేడు అధికంగా నమోదవుతున్నది, రెడ్డప్ప శెట్టి కృషి, పట్టుదల, ఆలోచనా శైలి ఇతర రైతులకు మార్గదర్శకమైంది. మండల వ్యాప్తంగా ఏ ప్రాంతంలో నీరు లేకపోయినా రెడ్డపు శెట్టి ఎస్టేట్‌లో మాత్రం సుందర వనాల మధ్యలో నీటి జలపాతాలు దర్శన మిస్తున్నాయి. మంచి, చెడు లాగా కొందరు ఆ ఎస్టేట్‌పై బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నారు. ఏదిఏమైనా పర్యావరణాన్ని పరిరక్షించే వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

భక్త కనకదాసు విగ్రహావిష్కరణ
కురబల ఐక్యతకు నిదర్శనం...

ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే మాలగుండ్ల

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్లలో శ్రీ భక్త కనకదాస సేవా సంఘం ఆధ్వర్యంలో ఒక మహోత్సవంగా, కనకదాస విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం కురుపుల ఐక్యతకు నిదర్శనమని వైసీపీ జిల్లా అధ్యక్షులు, పెనుకొండ ఎమ్మెల్యే మాల గుండ్ల శంకర నారాయణ పేర్కొన్నారు. ఆదివారం గోరంట్ల లోని హిందూపురం రోడ్డులో గల మండల కాంప్లెక్స్ ప్రధాన సర్కిల్‌లో గోరంట్ల మండల భక్త కనకదాస సేవా సంఘం ఆధ్వర్యంలో కనకదాస విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వద్ద నుండి మహిళలు, గురవయ్యలు వారి సాంప్రదాయ పద్ధతిలో జ్యోతుల ఉత్సవంతో విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాల గుండ్ల, ఎంపీ మాధవ్, రాష్ట్ర కురువ సంఘం నాయకులు బోరంపల్లి ఆంజనేయులు, కురుబ కృష్ణమూర్తి, నెమలి వరం ఈశ్వరయ్య ర్యాలీలో పాల్గొన్నారు. సందర్భంగా ప్రత్యేక పూజలు నడుమ విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించారు. మాల గుండ్ల మాట్లాడుతూ... కనకదాసు విగ్రహం ఏర్పాటుకు, విగ్రహం ఆవిష్కరణకు ప్రభుత్వం ద్వారా అన్ని సహాయ సహకారుల అందించామని ఎలాంటి ఆటంకాలు జరగకుండా పూర్తి చర్యలు తీసుకున్నామన్నారు, రాష్ట్ర కురువ సంఘం నాయకులు ఈశ్వరయ్య, రాజహంస శ్రీనివాసులు, బోరంపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో అనంతపురం పట్టణంలో గత నెలలో జరిగిన గుడికట్ల సంబరాలు గతంలో ఎన్నడూ జరగని విధంగా 220కు పైగా దేవతా విగ్రహాలను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున నిర్వహించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అందరి ఆశీస్సులతో కురబ కులస్తుడిగా తాను ఎమ్మెల్యే అయ్యానన్నారు, కురబల ఉన్నతికి పాటుపడతానని చెప్పారు.

యుద్ధ వీరుడు భక్త కనకదాసు... ఎంపీ గోరంట్ల మాధవ్.. కురవ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ భక్త కనకదాసు యుద్ధ వీరుడు, రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి, కుల వివక్షత కోసం పోరాడిన మహా భక్తుడు అని హిందూపురం పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్ తెలిపారు, ఉడిపి దేశంలో దేవాలయంలో జరిగిన అడ్డుకోవడంతో శ్రీరాముడిని భక్తి భావంతో తన వైపు తిప్పుకున్న మహా భక్తుడని, గోరంట్ల పట్టణంలో ఇంత పెద్ద ఎత్తున భక్త కనకదాసు విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించడం పట్ల ఎమ్మెల్యే మాలకొండకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలుపుతున్నానని, ఐక్యత కోసం కట్టుబాట్లను, సంస్కృతి సాంప్రదాయాలను ప్రేమ ఆప్యాయతను కలిగి ఉండాలని, ప్రధానంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకేసారి స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఎప్పుడు జరగని విధంగా ఇంతమంది కురువ

సనాతన ధర్మం... సకల జనుల సంతోషం..

ఎమ్మెల్యే మాల గుండ్ల శంకర్ నారాయణ - ప్రపంచం బాగుండాలని కోరుకున్న వ్యక్తి సత్య సాయిబాబా..

విశాలాంధ్ర-గోరంట్ల: సర్వజనుల సంతోషం ఆనందం కోరుకున్న దైవాంశ సంభూతులు.. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా అని ఎమ్మెల్యే మాల గుండ్ల పేర్కొన్నారు. ఆదివారం విశ్రాంత ఉద్యోగుల పెన్షనర్స్ భవనం వద్ద గల గ్రామపంచాయతీకి చెందిన 6 సెంట్ల స్థలంలో శ్రీ సత్యసాయి భజన మండలి భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. సనాతన ధర్మం.. సకల జనుల సంతోషం కోరుకుంటుందని సత్యసాయి బాబా చెప్పేవారని, ప్రపంచం దేశం సస్యశ్యామలంగా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుని తపించారని కొనియాడారు. తమ వంతు సహాయంగా బాబా భజన మండలి భవన నిర్మాణానికి రూ.50వేలు విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్ సరోజా నాగే నాయక్, ఉప సర్పంచ్ రాజారెడ్డి, శ్రీ సత్య సాయి భజన మండలి మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి వెంకట శివారెడ్డి, రత్నమయ్య, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, పట్టణ కన్వీనర్ ధనారెడ్డి,సింగిల్ విండో అధ్యక్షులు రఘురామి రెడ్డి, మెదర శంకర, నాగభూషణ్ రెడ్డి,జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు భాష,సుబహాన్ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల కంటి పరిరక్షణే ధ్యేయం

రిటైర్డ్ కంటి వైద్యాధికారి డాక్టర్ నరసింహులు

విశాలాంధ్ర-ధర్మవరం: చేనేత కార్మికులకు కంటి పరీక్షలు చేయడం తన అదృష్టంగా భావిస్తానని రిటైర్డ్ కంటి వైద్యాధికారి డాక్టర్ నరసింహులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని శివానగర్ ఏడో వార్డు సచివాలయంలో శ్రీ చౌడేశ్వరి దేవి సేవాసమితి నిర్వాహకులు టీరే శ్రీరాములు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం డాక్టర్ నరసింహులు, వేరే శ్రీరాములు మాట్లాడుతూ చేనేత కార్మికులు, వృద్ధులు, పిల్లలు, పెద్దలకు కంటి సమస్య ఉన్న 58 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్టు తెలిపారు. కంటిపట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. కంటిపట్ట ప్రతి ఒక్కరూ కూడా జాగ్రత్తలు పాటించాలని, కంటి సమస్య వస్తే నాటు వైద్యం, ఆర్ఎంపీ డాక్టర్ల వద్దకు వెళ్ళరాదని, స్థానిక ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులలో వైద్య చికిత్సలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమం లో జాతీయ చేనేత మహిళా నాయకురాలు జయశ్రీ, కౌన్సిలర్ కేత లోకేష్‌తో పాటు శ్రీ చౌడేశ్వరి దేవి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్‌పై విద్యార్థులకు అవగాహన..

శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం: మండలంలోని మోటుమర్ల గ్రామంలో గల కస్తూరిబా గాంధీ హాస్టల్లో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ పై అవగాహన సదస్సు నిర్వహించామని శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మానవ హక్కులు, రాజ్యాంగం కల్పించిన హక్కులు, వాటి ద్వారా గల ప్రయోజనాలను తెలిపామన్నారు. అనంతరం గత సంవత్సరం ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన వారికి ఎస్వి ఆర్ సేవా ట్రస్టు సహకారంతో నగదు పురస్కారాలు అందించడం మాకెంతో సంతోషం కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో ఐహెచ్ఆం సీపీ ధర్మవరం సభ్యులు ఫరూక్ ఉల్లా, ఇమామ్, ముదషీర్, కలీం, కళాశాల ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్, విద్యార్థినీలు పాల్గొన్నారు.

కాశీనాయన ఆశ్రమానికి విరాళాలు

విశాలాంధ్ర-ధర్మవరం: మండలంలోని గరుడం పల్లి చికిచెర్ల రోడ్డులో గల శ్రీ ధర్మశాస్త్ర కాశీనాయన ఆశ్రమ అభివృద్ధికి పలువురు దాతలు విరాళాలు అందజేశారని ఆశ్రమ నిర్వాహకులు శివారెడ్డి, శంకర చౌడప్ప తెలిపారు. అనంతరం మాట్లాడుతూ దారా బాల పెద్దక్క ఇందిరానగర్ ధర్మవరం వారు రూ.10 వేలు, ధర్మవరం శాంతినగర్‌కు చెందిన గాజుల హరికృష్ణ రూ.5 వేలు, శాంతి నగర్‌కు చెందిన మునుస్వామి రూ.2 వేలు, రాజేంద్రనగరు చెందిన పగిడి రెడ్డి సుభద్రమ్మ కృష్ణారెడ్డిలు రూ.2 వేలు, పాల డైరీ జగదీష్ అవసరమైన బియ్యం, కేజీఎస్ సిమెంట్ ఫ్రీ కాస్ట్స్ బత్తలపల్లి వారు రూ.వెయ్యి, మూడు సిమెంటు కుర్చీలు ఇచ్చి తమ దాతృత్వం చాటుకున్నారని తెలిపారు. దాతలకు శివారెడ్డి శంకర చౌడప్ప కృతజ్ఞతలు తెలిపారు.

14 నుంచి లక్ష్మీ వెంకటేశ్వర స్వామి తిరు కళ్యాణ మహోత్సవ వేడుకలు..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని అనంత పద్మనాభ స్వామి నగర్ చెన్నూరు రోడ్డు లోపల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 14వ తేదీ నుండి 16వ తేదీ వరకు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి తిరు కళ్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు శ్రీ గోవింద మాల సేవా కమిటీ అధ్యక్షులు భజనగారి నాగరాజు, గురుస్వామి దాసరి తిమ్మిశెట్టి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ ఈనెల 15న సాయంత్రం 6 గంటలకు కోదండ రామస్వామి భజన బృందం, తదుపరి అభయ హస్త సేవా సమితి వారిచే అన్నమాచార్య కీర్తనలు ఆలపించుట, 16వ తేదీన తిరు కళ్యాణ మహోత్సవ వేడుకలు, అన్నదాన కార్యక్రమం, సాయంత్రం గ్రామోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. తిరుకళ్యాణ మహోత్సవ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కళావతిలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది. ఘంటసాల కళారాధన సమితి ఆధ్వర్యంలో, కళాజ్యోతి వారి సౌజన్యంతో కీర్తిశేషులు ఘంటసాల వెంకటేశ్వరరావు, కీర్తిశేషులు ఎస్పీ బాలసుబ్రమణ్యం జ్ఞాపకార్థం ఈ సంగీత విభావరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని సోలిగార్ల చిన్న వెంకటేశులు, బాలం శ్రీనివాసులు తెలిపారు. సభాధ్యక్షులుగా కళాజ్యోతి సంస్థ అధ్యక్షులు కుంటిమల నారాయణ వ్యవహరించారు. నేడు దేశ స్థాయిలోనే ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రమణ్యం పాడిన పాటలు లక్షలాదిమంది పాలకుల్ని ఆకర్షింప చేసి ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. గాయనీ గాయకులు బాలం శ్రీనివాసులు, పూజారి రామాంజనేయులు, జెల్లీ శ్రీరాములు, పూజారి లక్ష్మీనారాయణ,పులిచెర్ల శ్రీనివాసులు, జ్యోతి తదితరులు పాడిన పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. ధర్మవరం ఘంటసాల కళారాదనా సమితి వారిచే ఈ కార్యక్రమం నిర్వహణ తమకెంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను మా కళాజ్యోతిలో నిర్వహించడం పట్ల కళాజ్యోతి అధ్యక్షులు కుంటిమల నారాయణతో పాటు రామకృష్ణ తదితర కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు జీవనజ్యోతి పాఠశాల విద్యార్థి ఎంపిక..

విశాలాంధ్ర-ధర్మవరం: గత నెల ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-14 హాకీ పోటీలలో, పట్టణంలోని జీవనజ్యోతి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్. పజులుద్దీన్ ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక కావడం జరిగిందని పాఠశాల హెచ్ఎం. సిస్టర్ ఝాన్సీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపికైన ఫజ్లులుద్దీన్ అనే విద్యార్థి ఈనెల 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు అన్నమయ్య జిల్లాలోని మదనపల్లిలో జరుగు ఎస్‌జిఎఫ్ అండర్-14 రాష్ట్రస్థాయి హాకీ పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎంతో పాటు పాఠశాల పిఈటి, ఉపాధ్యాయ బృందం అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

తల్లిదండ్రులు మందలించారని విద్యార్థి ఆత్మహత్య

విశాలాంధ్ర-పుట్టపర్తి: ఉదయాన్నే నిద్ర లేవకపోవడంతో తల్లిదండ్రులు మందలించడంతో క్షణికావేశంలో విద్యార్థి వినయ్(12) ఆత్మహత్య చేసుకున్న సంఘటన పుట్టపర్తి మండల పరిధిలోని బత్తలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు కుటుంబ సభ్యుల వివరాల ఆదివారం ఉదయం వినయ్ తల్లిదండ్రులు నాగరాజు కల్పన, పనుల నిమిత్తం బయటకు వెళ్లేందుకు ఉదయాన్నే నిద్రలేవమని మందలించగా వారు ఇంటి నుండి వెళ్లిన అనంతరం ఇంట్లోని దూలానికి ఉన్న హుక్కుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతరం సోదరుడు ఉరి వేసుకున్న సంగతి తెలుసుకొని కుటుంబ సభ్యులకు గ్రామస్తులకు తెలిపారు. తల్లిదండ్రులు ఇంటికొచ్చి కన్నీరు మున్నీరయ్యారు. వినయ్ పెదపల్లి ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు, సంఘటన స్థలాన్ని పుట్టపర్తి రూరల్ ఎస్సై కృష్ణమూర్తి పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తమై పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు పుట్టపర్తి రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టణ నివాస ప్రాంతాల్లో మౌలిక సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాం భూపాల్

విశాలాంధ్ర-కదిరి: పట్టణ నివాస ప్రాంతాల్లో మౌలిక సమస్యలు పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాం భూపాల్ డిమాండ్ చేశారు. ఎన్జీవో హోంలో సిపిఎం నిర్వహించిన పట్టణ నివాస ప్రాంత కార్యకర్తల జిల్లా వర్క్ షాప్‌లో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీ, నగర పంచాయతీలలో పేదలు నివసించే ప్రాంతాలలో రోడ్లు, తాగునీరు సౌకర్యాలు లేవన్నారు. చెత్త పన్ను, నీటి పన్ను పేరుతో ప్రజలపై భారాలు వేసే ప్రభుత్వాలకు కనీస సౌకర్యాలను కల్పించాలనే చిత్తశుద్ధి లేదని విమర్శించారు. పట్టణ నివాస ప్రాంతాల్లో పేదలు నివసించే కాలనీలకు మౌలిక సౌకర్యాల కోసం డబ్బులు ఖర్చు చేయడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. జగనన్న కాలనీల పేరుతో ఏర్పాటు చేస్తున్న నివాస ప్రాంతాల్లో విద్యుత్తు సౌకర్యం, రోడ్డు సౌకర్యం కల్పించడం లేదన్నారు. రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీలలో తాగునీటి కుళాయిలకు మీటర్లు పెట్టి డబ్బులు వసూలు చేయాలనే దుర్మార్గమైన విధానానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయన్నారు . ప్రజలకు ఉచితంగా అందించాల్సిన పౌర సేవలకు ఫీజు వసూలు చేయడం అన్యాయం అన్నారు. నివాస ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను గుర్తించి పోరాడాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బడా సుబ్బిరెడ్డి, నాయకులు జి.ఎల్. నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, రామ్మోహన్, బాబ్ జాన్, శాంతి బాయ్, బాబా పాల్గొన్నారు.

నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు..

విశాలాంధ్ర- ధర్మవరం: ధర్మవరం నియోజకవర్గం కమిటీని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రంగన్న అశ్వత్ నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు అధ్యక్షులుగా అభ్యర్థులను ఎంపిక చేశారు. ఇందులో ధర్మవరం పట్టణ అధ్యక్షుడిగా పి. షమీవుల్లా, రూరల్ అధ్యక్షులుగా కె.జంగమన్న, ముదిగుబ్బ మండల అధ్యక్షుడుగా బి.ప్రభాకర్, తాడిమర్రి మండల అధ్యక్షుడుగా బి.గిరి, బత్తలపల్లి మండల అధ్యక్షుడుగా షేక్ గండికోట ముక్తియార్ లను ఎంపిక చేసి పార్టీ ద్వారా వచ్చిన ఆర్డర్స్ కాఫీను అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జ్ రంగనాయక నారాయణ ఈ కమిటీని ఆమోదం తెలిపినందుకు సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డికి, ఏపిసిసి అధ్యక్షులు పిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాయలసీమ ఇంచార్జ్ జంగా గౌతం, డిసిసి అధ్యక్షులు ఎక్స్ ఎమ్మెల్యే సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేటి శ్రీధర్‌కు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం తిరిగితెస్తామని ప్రతి ఒక్క కార్యకర్తను కలుపుకొని పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు. కర్ణాటక తెలంగాణలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో కూడా కొత్త ఉత్సాహాన్ని నింపిందని ధర్మవరం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరేవేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ముదిగుబ్బ పిసిసి డెలికేట్ సభ్యులు మిషారా మద్, మాజీ తాడిమర్రి మండల కన్వీనర్ కాటమయ్య, ధర్మవరం మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖరీమ్, మునాఫ్, ఫారూఖ్, జాఫర్, నూరు, షబ్బీర్, రంగనాథ్ పాల్గొన్నారు.

యాదవ్‌లను గుర్తించిన పార్టీకే సంపూర్ణ మద్దతు

- ఉమ్మడి అనంత జిల్లాలో 5 లక్షల యాదవ్‌ల ఓటు బ్యాంకు
- ఒక ఎంపీ, 4 ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలని డిమాండ్

విశాలాంధ్ర-పుట్టపర్తి : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో యాదవ్ కులస్తులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని యాదవ్ సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప యాదవ్ డిమాండ్ చేశారు. పుట్టపర్తి పట్టణంలోని శిల్పా రామంలో యాదవ్ సంఘం నాయకులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసప్ప మాట్లాడుతూ పుట్టపర్తిలోని సర్వే నంబర్ 22లో బోడిగుట్టలో ఉన్న భూమిని గతంలో యాదవ్ కులస్తులే సాగు చేసుకుంటూ జీవిస్తుం దేవారనీ, ఇప్పుడు ప్రభుత్వం ఆధీనంలో ఉందన్నారు. కావున నూతన జిల్లా కేంద్రం లో యాదవ్ సంఘానికి సంబంధించి కమ్యూనిటీ హాలు, తమ కులదైవం శ్రీకృష్ణుని దేవాలయానికి ఆ భూమిని కేటాయించాలని జిల్లా యాదవ సంఘం తరపున ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేను కోరారు. ఉమ్మడి అనంతపురం శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తం గా దాదాపు 5 లక్షల మంది యాదవ్ కులస్తుల ఓటర్లు ఉన్నారని, పార్లమెంటు, శాసనసభ నియోజక వర్గాలలోని అభ్యర్థుల జయాపజయాలను యాదవ్ కులస్తుల ఓట్లు ప్రభావితం చేస్తాయన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో యాదవ్‌లకు ఒక ఎంపీ 4 ఎమ్మెల్యే స్థానాల టికెట్లను ఏ పార్టీ అయితే గుర్తించి ఇస్తుందో ఆ పార్టీకే సంపూర్ణ మద్దతు తెలుపుతామన్నారు. లేనిపక్షంలో యాదవ్ కులస్తుల సత్తా చూపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, యాదవ్ సంఘం జనరల్ సెక్రెటరీ దయ్యాల ఉమాపతి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు బాలాంజనేయ యాదవ్, నాయకులు వరప్రసాద్, గంగాధర్, నారాయణ స్వామి, నరసింహ, కృష్ణమూర్తి, సుధాకర్ శ్రీరాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, రాజశేఖర్, సురేంద్ర, కొండయ్య, కిరణ్, రమేష్ పాల్గొన్నారు.

ధర్మవరంలో ఏ అభివృద్ధి జరిగినా స్వాగతించేది టీడీపీ మాత్రమే..

ధర్మవరం నియోజకవర్గ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరంలో ఏ అభివృద్ధి జరిగినా ముందు స్వాగతించేది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా భవిష్యత్ గ్యారెంటీ అనే కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గొల్లపల్లి, బడన్నపల్లి గ్రామాలలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. అనంతరం పరిటాల శ్రీరామ్ ప్రతి ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోకు సంబంధం చిన కరపత్రాలను అందజేస్తూ అందులోని పథకాల గురించి వివరించారు. గత నాలుగు సంవత్సరాలుగా వైఎస్ఆర్సిపి వల్ల నష్టపోయిన అభివృద్ధి పనులను వారు వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడిని గెలిపిస్తే ప్రతి గ్రామము అభివృద్ధి బాటలో నడుస్తుందని తెలిపారు. అలాగే అక్కడి గ్రామ ప్రజలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను శ్రీరామ్ దృష్టికి తీసుకుని వెళ్లారు. స్పందించిన పరిటాల శ్రీరామ్ సంబంధిత అధికారులతో తప్పక మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డికి ప్రజలన్న ప్రజా సమస్యలన్నీ లెక్కలేకుండా పోయిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మవరంలోని కదిరి గేటు వద్ద రైల్వే ఉపరితల వంతెన నిర్మాణం చేపట్టారని ఇందులో ఎవరికి రెండవ అభిప్రాయము లేదన్నారు కానీ దశాబ్దాలుగా నివాసముంటున్న వారికి సరి అయిన అబ్రహాము ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్ట దం సరైన పద్ధతి కాదని తెలిపారు. తాము బాధితుల పక్షాన నిలబడితే అభివృద్ధికి అడ్డుపడుతున్నారని తమపై లేనిపోని ఆరోపణలు చేయడం పట్ల వారు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రూరల్ నాయకులు కార్యకర్తలు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంది..

- రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జయ, నాగభూషణ

విశాలాంధ్ర-ధర్మవరం: పేద ప్రజలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉందని రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్ గుప్తా, క్యాంపు చైర్మన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శంకరా కంటి ఆసుపత్రి-బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ-అనంతపురం వారి సహకారంతో ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ వైద్య శిబిరానికి దాతలుగా కీర్తిశేషులు దాసరి కేశమ్మ అండ్ కీర్తిశేషులు దాసరి పెద్ద వెంకటేశులు జ్ఞాపకార్థం వీరి కుమారుడు దాసరి రమాదేవి, డివి. వెంకటేశులు (చిట్టి) వ్యవహరించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ వారిని ఘనంగా సన్మానించారు. నేటి శిబిరానికి 168 మంది కంటి రోగులు రాగా, అందులో వారందరికీ వైద్య చికిత్సలను అందించిన ప్రతిప 126 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక కావడం జరిగింది అని తెలిపారు. వీరందరికీ ఉచిత రవాణా సౌకర్యంతో పాటు ఉచిత ఆపరేషన్లు, ఉచితంగా కంటి అద్దాలు కూడా పంపిణీ చేస్తామని తెలిపారు.ప్రతినెల ఈ ఉచిత కంటి శిబిరాన్ని పేద ప్రజల కోసమే నిర్వహిస్తున్నామని, పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కంటి చూపు తెప్పించుకోవాలని వారు తెలిపారు. అదేవిధంగా నేత్రదానం చేసి, అంధత్వాన్ని నివారించాలని, రెండు జీవితాలలో వెలుగు నింపాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, సత్రశాల ప్రసన్నకుమార్, సోలిగాళ్ళ చిన్న వెంకటేశులు, రమేష్ బాబు, బోనాల శివయ్య, కొండయ్య, మనోహర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

21 మంది జూదరులు అరెస్ట్ -రూ. 3 లక్షలు నగదు, 25 ద్విచక్రవాహనాలు స్వాధీనం..

విశాలాంధ్ర-లేపాక్షి : మండలంలోని శిరివరం శివార్లలో ఉన్న ఓబుళాపురం చెరువు వద్ద ఎన్నో రోజులుగా పెద్ద ఎత్తున జరుగుతున్న జూదాల స్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 21 మంది జూదరులను అదుపులోకి తీసుకుని రూ. 3లక్షలు నగదుతో పాటు 20 సెల్ ఫోన్లు, 25 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఉదయం ఎస్పీ ఆదేశాల మేరకు హిందూపురం డియస్పీ కంజక్షన్, రూరల్ సిఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎస్ఐ గోపితో పాటు సిబ్బంది దాడులు నిర్వహించారు. అనంతరం లేపాక్షి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో రూరల్ సిఐ మాట్లాడుతూ కొంతకాలంగా లేపాక్షి, హిందూపురం మండలాలు, కర్ణాటక, రాష్ట్రంకు చెందిన బాగేపల్లి, గౌరిబిదనూరు, చిత్రదుర్గ, తుంకూరు ప్రాంతాల వారు భారీగా జూదాలు ఆడుతున్నారని, 28 మంది జూదరులు జూదం ఆడుతుండగా 7 మంది పరారీ అయ్యారని తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట స్థావరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 11,డిసెంబర్ 2023

బాబు షూరిటీ- భవిష్యత్ వేగవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే బీకే. పార్థసారథి

విశాలాంధ్ర-గోరంట్ల: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పెనుకొండ నియోజకవర్గంలో వేగవంతంగా నిర్వహిస్తున్న బాబు షూరిటీ- భవిష్యత్ కు గ్యారెంటీ టెలిగ్రామ్ బాట్ లో నమోదు కార్యక్రమంలో భాగంగా గోరంట్ల మండలంలోని క్లస్టర్, యూనిట్ ఇంచార్జిలు పార్టీ నాయకులు వేగవంతం చేయాలనీ మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి తెలిపారు, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థ రెడ్డి స్వగృహంలో సమీక్ష సమావేశం నిర్వహించారు, సమావేశంలో పార్లమెంట్ కార్యదర్శి దేవా నరసింహులు,శశి భూషణ్ పటేల్, నీలకంఠారెడ్డి, సాయి కళ్యాణ్,మాజీ సర్పంచ్ తిరుపాల్,వెంకట రెడ్డి, మనోహర్,ఉమర్ ఖాన్, మనిశేఖర్ రెడ్డి,హరి,రంగప్ప, భరత్,రంగనాథం,నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: తెలుగుదేశం పార్టీ తొనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ ధనుంజయ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గౌనూరు గ్రామంలో బాబు ప్యూ రి టీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో పరిశ్రమలు ఉద్యోగాలు సంక్షేమం అందిస్తా రని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు బాబుష్యురిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పయ్యావుల మోహన్, రవిచంద్ర, సాగర, గౌనూరు టిడిపి నాయకులు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి

విశాలాంధ్ర-ఆత్మకూరు: టిడిపి అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని మండల కన్వీనర్ ముత్యాల శ్రీనివాసులు అన్నారు. మండలంలోని సనప గ్రామంలో ఆదివారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తిరుగుతూ మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన ఈ నాలుగున్నర ఏళ్లలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని, కేవలం రాజకీయ కక్షతో పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా అధ్యక్షుడు బాలఉజ్జనప్ప, బూతు కన్వీనర్లు పరందామ, రాజా, యూనిట్ ఇంచార్జ్ రంగనాథరెడ్డి, పోతలయ్య రజనీకాంత్, హరికుమార్, తలారి నాగరాజు రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు వడ్డే నాగేంద్ర, పూజారి సుధాకర్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, సనప గోవిందు, డిష్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-కదిరి: ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి విడుదలైన రూ. 9.25 లక్షల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే డా. పీవీ సిద్దారెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సహాయ నిధి నుండి ఆరోగ్యశ్రీ వర్తించని వివిధ జబ్బులతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రి నందు చికిత్స తీసుకొన్న వారికి రూ.9.25 లక్షల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు. దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని, జగన్మోహన్ రెడ్డి రూ.1000 రూపాయలకు పైబడిన ప్రతి జబ్బుకు ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తూ పేదవారి ఆరోగ్యానికి భరోసా ఇచ్చారన్నారు. 108 , 104 వాహనాలను ఆధునికీకరించి పేదల వైద్యాన్ని సులభతరం చేసారన్నారు.

మండల అధ్యక్షునిగా పవన్ కుమార్

విశాలాంధ్ర-లేపాక్షి : ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ పై మాదిగలకు న్యాయం జరిగేంత వరకు నిరంతరం కృషి చేస్తానని లేపాక్షి ఎం ఆర్ పి ఎస్ మండల అధ్యక్షులు పవన్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం పంచాయతీ కార్యాలయావరణంలో ఏపి ఎంఆర్పిఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా స్థానిక ఎంఆర్పియస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంఆర్పియస్ మండల అధ్యక్షులుగా పవన్ కుమార్, మండల ఉపాధ్యక్షులుగా విజయకుమార్లతో పాటు కమిటి సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పియస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేశు, రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు, జిల్లా ఇన్చార్జి తిప్పయ్య. రాయలసీమ కన్వీనర్ రామాంజినేయులు, జిల్లా కార్యదర్శి విజయకుమార్ ,నరేష్ తదితరులు.పాల్గొన్నారు.

బత్తలపల్లిలో శాఖహార ర్యాలీ

విశాలాంధ్ర - బత్తలపల్లి : బత్తలపల్లి శ్రీహరిహర ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం శాఖహార ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిధిగా బ్రహ్మర్షి గోపాల్ రెడ్డి హాజరయ్యారు. జంతువులలో అనేక దేవుళ్ళు నిక్షితమై ఉంటారని కావున జంతు హింస మహాపాపమని, శాకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉండవచ్చునని తెలియపరుస్తూ బత్తలపల్లి పురవీధుల గుండా కీలుగుర్రాలు, మారగాళు ్ళ, డప్పులమోతలతో ధ్యానసభ్యులు నినాదాలతో శాఖాహార ర్యాలీని నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మించిన శ్రీహరిహర ధ్యాన కేంద్రాన్ని ధ్యానగురువు బ్రహ్మర్షి గోపాల్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మానవుడు తన లోపల తాను ఆస్వాదించి ఆనందించే ఒక పరిమళమే ధ్యానమన్నారు. ఒత్తిడిలో ఉన్నవాళ్లు ఎట్టిపరిస్థితుల్లో ప్రశాంతంగా జీవితం కొనసాగించలేరన్నారు. ధ్యానంవల్ల అన్ని ఒత్తిడులను అధిగమించే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మదనాపు కొండన్న, నాగేంద్ర,తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మానానికి విరాళం

విశాలాంధ్ర-పుట్టపర్తి: పుట్టపర్తి మండల పరిధిలోని సుబ్బరాయన పల్లి గ్రామంలో నిర్మించ తలపెట్టిన రామాలయానికి లక్ష విరాళాన్ని అందజేశారు. గతంలో గ్రామంలో ఉండి ఉద్యోగరీత్యా హిందూపురంలో స్థిరపడ్డ రాయల్ల చంద్రశేఖరప్ప కుమారుడు ఉపాధ్యాయుడు గురు ప్రసాద్, అతని కుటుంబ సభ్యులైన వెంకటేశ్వర ప్రసాద్, శ్రీనాథ్, శేషాద్రి నాయుడు మీనాక్షమ్మ,ఆదివారం గ్రామంలోని ఆలయ కమిటీ సభ్యులకు ఆ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని అభినందించారు. ఈ సందర్భంగా గురు ప్రసాద్ మాట్లాడుతూ సొంత గ్రామంలో నిర్మించ తలపెట్టిన ఈ దేవాలయానికి తన వంతు సాయంగా లక్ష రూపాయలు అందజేస్తున్నానని భవిష్యత్తులో గుడి నిర్మాణంలో, ఎలాంటి కార్యక్రమాల్లో నైనా తన వంతు సాయాన్ని అందిస్తానని తెలిపారు . ఈ కార్యక్రమంలో శేషాద్రి నాయుడు, మాజీ సైనికుడు మహానంద, జయచంద్రా, అరవింద్ రెడ్డి ,చౌడప్ప ముద్దల చినరాయుడు , భయపరెడ్డి మేకల నరసింహులు,కేశవ, లింగమయ్య, శివ, హరీష్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ

విశాలాంధ-యాడికి : యాడికి మండలం రెడ్డివారి గుడిసెలు, రామన్న గుడిసెలు, చంద్రాయిని పల్లె గ్రామాలలో బాబు ష్యురిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం టిడిపి మండల కన్వీనర్ రుద్రమ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. సూపర్ సిక్స్ మినీ మేనిఫెస్టోలో వున్న పథకాలు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో, దడియల అది,రామచంద్రా రెడ్డి, మధు రాజు,విక్రమ్, నీల కంటా రెడ్డి, విజయ్ ,నరసింహ, దాదా భాష,రఘు రాముడు, కృష్ణారెడ్డి, కేశవరెడ్డి, రమేష్ గంగాధర్,గంగ రాజు, రాజా, రామాంజనేయులు,రాజు,వెంకటేశు,బాలు, తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వైసీపీతోనే సాధ్యం

విశాలాంధ్ర- నల్లమాడ: సంక్షేమ పథకాలు జగనన్న తోనే సాధ్యం మని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గోపేపల్లి, గోపేపల్లితండా, రాగానిపల్లి, తండాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సర్పంచ్ రోహిణి రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఇంటింటా తిరిగి సమస్యలు తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారం చేశారు. సంక్షేమ పథకాలు ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. సమస్యలు ఏమైనా వుంటే మా దృష్టికి తేవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సూర్య నారాయణ, నాయకులు టి ఆదినారాయణ రెడ్డి, సాంబశివారెడ్డి, మోహన్ రెడ్డి, ఉత్తమ రెడ్డి, రవిచంద్రారెడ్డి, పీవి భాస్కరరెడ్డి, పలుశాఖ అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పాము కాటుతో రైతుకు అస్వస్థత

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మండలం నింబగల్లు గ్రామానికి చెందిన బసప్ప అనే రైతు ఆదివారం పొలంలో పనిచేస్తుండగా పాము కాటికి గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు అనంతపురానికి తరలించారు.

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నందు ఆదివారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం అవగాహన కార్యక్రమం వన్నిక ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేయడం జరిగింది. వక్తలు మానవ హక్కుల గురించి చర్చించి మానవ హక్కులకు భంగం కలగకుండా కాపాడాల్సిన ప్రజాస్వామ్య పద్ధతిలో రాజ్యాంగ విలువలను తెలుసుకొని నడుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో షా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాయలసీమ మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరి, అమృత యాదవ్, ముత్యాలమ్మ ,లక్ష్మీ, సిరాజుద్దీన్, ఆదిశేషయ్య, పాన్ భాష మరియు దళిత సంఘ నాయకులు రామాంజనేయులు, ఎమ్ ఎన్ మూర్తి కోనాపురం పెద్దన్న బ్రాహ్మణపల్లి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా, ట్రాక్టర్ సీజ్

విశాలాంధ్ర-అమడగూరు: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, ముందస్తుగా రాబడిన సమాచారం మేరకు తనకల్లు సి.ఐ. సైదుల్ ఆదివారం మహమ్మదాబాద్ క్రాస్ నుండి అమడగూరు పరిసర ప్రాంతాలకు ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నాలుగు టన్నుల ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ను, కసముద్రం మలుపు వద్ద సీజ్ చేసి, డ్రైవర్ ను అదుపులోనికి తీసుకొని, స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించడమై దని, సి ఐ. తెలిపారు. మండలంలో ఎక్కడైనా ఎవరైనా అక్రమ మద్యాన్ని విక్రయిస్తున్న, ఇసుకను తరలిస్తున్న, మాకు తెలపాలని, వివరాలు తెలిపిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని, దీనికి మండల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఫిరోజ్‌ను పరామర్శించిన బి.కె పార్థసారథి

విశాలాంధ్ర-గోరంట్ల: పెనుకొండ నియోజకవర్గం లోని గోరంట్ల మండలం మల్లాపల్లి గ్రామానికి చెందిన ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ బాషా ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా అక్కడికి వెళ్లి శ్రీసత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, పెనుకొండ నియోజకవర్గ ఇన్చార్జి బికె.పార్థసారథి పరామర్శించారు, అలాగే పార్లమెంట్ కార్యదర్శి దేవా నరసింహప్ప, వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు బెల్లాల చెరువు చంద్ర, రామాంజనేయరెడ్డి, గంగిరెడ్డి,నాగేంద్ర, పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన

విశాలాంధ్ర-అమడగూరు: పుట్టపర్తి శాసనసభ్యులు శ్రీధర్ రెడ్డి ఆదేశాల మేరకు అమడగూరు మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న గృహాలను ఆమడగూరు మండలం వైసిపి గృహ పర్యవేక్షులు డాక్టర్ బొగ్గు సురేష్ పరిశీలించాడు. లబ్ధిదారుల సమస్యలను తెలుసుకుని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అర్హులైన గృహ లబ్ధిదారులు ప్రతి ఒక్కరికీ సిమెంటు, బిల్లులు మంజూరు అవుతాయని, ఎవరు అధైర్య పడవద్దండని మీ సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ బోర్డ్ డైరెక్టర్ శేషు రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జ్యోతి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీలో....కదం తొక్కిన తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర-ఓడిసీరూరల్: ఆదివారం పుట్టపర్తి నియోజకర్గ ఇన్ ఛార్జ్ మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సమక్షంలో ఓడి చెరువు మండలం మద్దక వారిపల్లిలో చౌటకిస్ట అధ్వర్యంలో సుమారు 36 కుటుంబాలకు పైగా తెదేపాలోకి చేరారు. అంతకు ముందు ఓడి చెరువు నుంచి తంగేడు కుంట పంచాయతీ వరకు సుమారు 16 కిమి సాగిన బైక్ ర్యాలీలో పూల వర్షం కురిపించి తెలుగు తమ్ముళ్లు కదం తొక్కారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ టీడీపీ దేనని,ప్రజలకు అండగా ఉంటానని, పుట్టపర్తిలో టీడీపీ భారీ మెజారిటీతో గెలుపు ఖాయమన్నాడు. కులమతాలకు అతీతంగా పరిపాలన సాగించే వ్యక్తి చంద్రబాబు నాయుడే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నిమ్మల కిష్టప్ప, కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబుల రెడ్డి, పీట్ల సుధాకర్, సామకోటి ఆదినారాయణ, డాక్టర్ జాకీర్, శ్రీనివాసులు, డ్రిప్ నాగరాజు,కంచి సురేష్, జరిపిటి అంజినప్పా, అంజిన్ రెడ్డి,రాయల్ కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

జనసేన శ్రేణుల బైక్ ర్యాలీ

విశాలాంధ్ర-అమడగూరు: స్థానిక మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో ఆదివారం జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి పత్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి జనసేన జెండాను ఆవిష్కరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన పార్టీ నాయకులకు మద్దతుగా బైక్ ర్యాలీ నిర్వహించి, బాణాసంచా పేల్చి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన కదిరి

విశాలాంధ్ర-కదిరి: కదిరి పట్టణంలో వెలసిన శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప 47వ మండల పూజ సందర్భంగా కదిరి పట్టణం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6గంటల నుండి వివిధ రకాల పూలతో అలంకరించిన ప్రత్యేక రథంలో హరి హర శుతుడు అయ్యప్ప ఆసీనులైన రథం ముందుకు సాగింది. రథం ముందు అయ్యప్ప స్వాములు రక రకాల రంగులు చల్లుకొంటూ భక్తి గీతాలు పాడుకొంటూ గ్రామోత్సవం పాల్గొన్నారు. ప్రతి యేటా అయ్యప్ప గ్రామోత్సవంలో కేరళ నుండి ప్రత్యేక వాయిద్య కళాకారుల వాయిద్యాల మధ్య అయ్యప్పలు నృత్యాలు చేస్తూ పుర వీధుల్లో గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణ ప్రజలు స్వామి వారికి కాయ కర్పూరం సమర్పించి ప్రసాద వితరణ చేశారు.అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో అయ్యప్పలు ఓం స్వామియే శరణం అయ్యప్ప అంటూ అగ్ని గుండ ప్రవేశం చేశారు.అయ్యప్ప సేవా సమితి, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమములో వేలాది మంది కుటుంబ సమేతంగా విచ్చేసి అన్నదానం (బిక్ష)స్వీకరించారు.